## డెంగ్యూతో చిన్నారి మృతి


రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతురు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రుషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

## స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం


మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతురు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.


సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

# కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

- 2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు
- 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా?
- మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్
- రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం
- ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే
- బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకురాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉపముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

### మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

### రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

### వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

### నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్ఎస్ ఊరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

### ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసానపల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చునన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

### కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.


హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

## కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

## 3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

### • తాగునీటి కోసం గిరిజనుల నిరసన


మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి


మందులు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైద్యులు

## పారిశుధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు

తొర్రూరు, సెప్టెంబర్ 30 : మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్, శానిటేషన్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కమిషనర్ శాంతికుమార్ మాట్లాడుతూ.. 'సఫాయి అన్న సలాం అన్న, సఫాయి అమ్మ సలాం అమ్మ' అనే నినాదంతో ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్ గుగులోత్ శంకర్, నాయకులు దొంగరి శంకర్, బిజ్జాల అనిల్, పేర్ల జంప, తూర్పాటి రవి, మేనేజర్ కట్ట స్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

## రూ. 2కోట్లు స్వాహా..

**సోషల్ మీడియాలో చక్కర్లు**

నెల్లికుదురు, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంక్‌లో రూ.2కోట్లు స్వాహా అని సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. 'నెల్లికుదురు స్టేట్ బ్యాంకులో అవినీతి రాజ్యమేలుతుంది. పట్టాదారు పాస్ పుస్తకాలు ఒకరి పేరు నుంచి మరొకరి పేరుపై మార్చుకుంటూ దళారులతో బ్యాంకు అధికారులు కుమ్మక్కై సుమారుగా రూ. 2కోట్ల వరకు స్వాహా చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. తక్షణమే విచారణ చేపట్టాలి' అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టు సోమవారం వైరల్‌గా మారింది. దీనిపై బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా సోషల్ మీడియాలో ఫేక్ మెసేజ్ ఎక్కడి నుంచి పోస్టు అయిందో తెలియక సతమతమవుతున్నామని, విచారణకు స్థానిక పోలీసులను సంప్రదించినట్లు మేనేజర్ తెలిపారు.



సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న మెస్సేజ్

## స్కూల్ బస్సు ఢీకొని ఒకరి మృతి


కృష్ణ (ఫైల్)

బయ్యారం, సెప్టెంబర్ 30 : స్కూల్ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన బయ్యారం మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన సింగరబోయిన కృష్ణ (42) ఉదయం ఆవులను తోలుకొని పొలం వద్దకు వెళ్తుండగా, గ్రామ శివారులోఅటుగా ఓ ప్రైవేటు స్కూల్ బస్సు వెనక నుంచి ఢీ కొట్టింది. కృష్ణకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు . అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## గాంధీలో మెడికల్ సీట్ సాధించిన త్రిష్మిత

తొర్రూరు, సెప్టెంబర్ 30 : దేశ వ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించిన అర్హత పరీక్ష ఫలితాల్లో తొర్రూరు పట్టణానికి చెందిన బిజ్జాల సుధీర్–రాధిక కూతురు బిజ్జాల త్రిష్మిత 653(98.95శాతం) మార్కులతో తెలంగాణ విభాగంలో 286వ ర్యాంకు సాధించారు. ఓయూ పరిధిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు పొందినట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. త్రిష్మితను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

# ఉపాధ్యాయుడి పాత్ర గొప్పది

- జిల్లాలోని పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ
- సన్మాన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు

గార్ల, సెప్టెంబర్ 30 : సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర గొప్పదని రిటైర్డ్ ఎంఈవో గుడి రాంప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం రత్నకుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు శీలంశెట్టి వెంకటేశ్వర్లు, శివనాయక్, చింత రమేశ్, భాస్కర్, శ్రీనివాసులు, సురేశ్‌బాబు, ప్రత్యేకాధికారి ఉష, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు, మంజుల, రజని పాల్గొన్నారు.


గార్ల: సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంఈవో రాంప్రసాద్

**డోర్నకల్‌లో..**

డోర్నకల్: ఉద్యోగ విరమణ సహజమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీనారాయణ అన్నారు. సోమవారం ముల్కలపల్లి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ స్కూల్‌అసిస్టెంట్ కుసుమ నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సభ్యులు వెంపటి సీతారాములు, డీఎస్ వినోద్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

**గంగారంలో..**

గంగారం: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు విరమణ సహజమని ఎంపీడీవో అప్పారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించిన ధనలక్ష్మి ఉద్యోగవిరమణ సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో సభ నిర్వహించారు. ఆమెను ఎంపీడీవో అప్పారావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాము, మాజీ ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వీరభద్ర, జడ్పీటీసీ(మాజీ) రమ, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది**

కురవి: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రీనారాయణ అన్నారు. రాజోలులోని జడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వరిస్తున్న పల్ల వెంకన్న ఉద్యోగ విరమణ సన్మాన సభ స్కూల్ హెచ్ఎం రవికుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎంఈవో బాలాజి, మండల అధ్యక్షుడు నిమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టీ వెంకటేశ్, రాష్ట్ర బాధ్యులు రామ్మూర్తి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

గార్ల, సెప్టెంబర్ 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి సూచించారు. పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని రాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంపూర్ణ, టీచర్లు పద్మ, సుజాత, సరిత, శ్రీలక్ష్మి, కనకతార, సరస్వతి, ఆయాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి, మహిళలు

## జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు

చిన్నగూడూరు, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కల్చరల్ సెక్రటరీ దయానంద్ ఆధ్వర్యంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఎస్సై జాన్సీ, హెచ్ఎం రవికుమార్‌కు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బాధ్యులు జక్కి నాగేశ్వర్, జంపాల చక్రధర్ పాల్గొన్నారు.


సీఐ రాజ్‌కుమార్‌గౌడ్‌కు సభ్యత్వం అందిస్తున్న జేవీవీ వేదిక బాధ్యులు

## ఉపాధ్యాయురాలిపై దాడి

నెల్లికుదురు, సెప్టెంబర్ 30 : మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలిపై మరో ప్రభుత్వ ఉపాధ్యాయుడి బంధువులు దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు సమీపంలో మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి బంధువులు దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరిని అక్కడి నుంచి చెదరగొట్టారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీచర్‌తో సన్నిహితంగా ఉంటున్నందుకు ఉపాధ్యాయుడి బంధువులు దాడికి పాల్పడినట్లు సమాచారం.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

పెద్దవంగర, సెప్టెంబర్ 30 : విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో బీ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలంలోని బొమ్మకల్లు, రెడ్డికుంటతండా ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు తిరుపతిరెడ్డి, రవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుమాధవ్, ప్రణతి, సీఆర్పీ రంగన్న పాల్గొన్నారు.

## టీఆర్టీ ఫలితాల విడుదల

**1 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన**

హనుమకొండచౌరస్తా, సెప్టెంబర్ 30 : ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి విద్యాశాఖ నిర్వహించిన టీఆర్టీ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జాబితాను www.deohnk.inలో 1న పొందుపర్చనున్నట్లు డీఈవో వాసంతి తెలిపారు. సబ్జెక్టు, కేడర్ వారీగా 1:3 సెలక్షన్ జాబితాలో పేర్కొన్న అభ్యర్థులు వి ధిగా టీఆర్టీ–2024 అప్లికేషన్, సమర్పించిన నిజపత్రాలు, గెజిటెడ్ అధికారితో అ టెస్ట్ చేసిన 2సెట్స్ జిరాక్స్ పత్రాలతో సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 1నుంచి 5వరకు నిర్వహించే సర్టిఫికెట్స్ పరిశీలనకు హాజరుకావాలన్నారు. చెక్‌లిస్టును www.deohnk.inలో పొందుపరిచినట్లు డీఈవో వాసంతి చెప్పారు.

## శ్రీరామగిరి వాసికి రూ.50లక్షల గ్రాంట్



గ్రాంట్‌ను పొందిన ప్రభాకర్

నెల్లికుదురు, సెప్టెంబర్ 30 : మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన గాజుల ప్రభాకర్ (పీహెచ్‌డీ ప్లాంట్ సైన్స్) న్యూఢిల్లీలోని బయో టెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ కౌన్సిల్ ద్వారా రూ. 50లక్షల గ్రాంట్‌ను శనివారం హైదరాబాద్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్, ఐకేపీ నాలెడ్జ్ పార్కు హైదరాబాద్ సహకారంతో ఆర్గానిక్ బయో ఫెస్టిసైడ్స్ తయారీని పూర్తి చేసినట్లు తెలిపారు. త్రిప్ క్లియర్ పేరుతో ఉత్పత్తులను త్వరలో మార్కెట్‌లో అందుబాటులోకి రానున్నదని చెప్పారు. నల్లపురుగును నివారించే ఆర్గానిక్ బయో ఫెస్టిసైడ్‌ను రైతులకు తక్కువ ధరకే అందించేందుకు స్కేలాప్ ప్రాజెక్టు కింద టీ స్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ తనకు రూ.50లక్షల గ్రాంట్‌ను అందించిందని తెలిపారు.

## ఉపాధి కూలీలకు శిక్షణ

డోర్నకల్, సెప్టెంబర్ 30 : మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 2018–2024 వరకు ఈజీఎస్ కింద వందరోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు సోమవారం డోర్నకల్ ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. కంపోస్టు ఎరువు, డెయిరీ నిర్వహణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ మాలతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మీర్జాముస్వర్‌బేగ్, ఏపీఎం శంకర్‌నాయక్, ఏపీవో పార్థసారధి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మాలతి

## ఓటు నమోదు చేసుకోవాలి

డోర్నకల్, సెప్టెంబర్ 30: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల కోసం ఈ నెల ఒకటి నుంచి అర్హులు నమోదు చేసుకోవాలని సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మీర్జా మున్వర్ భేగ్ తెలిపారు. ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు.

## 'చలో నిధానపురం'ను విజయవంతం చేయాలి

దంతాలపల్లి, సెప్టెంబర్ 30: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో నిధానపురం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేశ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. నిధానపురం గ్రామంలో మాదిగలకు సంబంధించిన వారసత్వపు భూమిని వేరే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు లాక్కోవడానికి ప్రయత్నిస్తుండగా, వారికి సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు సీ విద్యార్థిని

కురవి, సెప్టెంబర్ 30 : జిల్లాలో ఈ నెల 28న జరిగిన యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోయెట్రీ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ కొత్తూరు(సీ) పాఠశాలకు చెందిన కొండ్లె ఉషస్విని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం, సీరోలు మండల విద్యాధికారి ఇస్లావత్ లచ్చీరాంనాయక్ తెలిపారు.

## యువత క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి

గంగారం, సెప్టెంబర్ 30: యువత క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలని ఈసం సురేశ్ సూచించారు. సోమవారం మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన ఈసం సురేశ్ తనకు క్రీడలపై ఉన్న మక్కువతో కుమ్రం భీం యూత్ కమిటీ సభ్యులకు వాలీబాల్ కిట్‌ను అందించారు. యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


యూత్ సభ్యులకు వాలీబాల్ కిట్టు అందిస్తున్న సురేశ్